# తల్లి ప్రేమకు నోచుకోలేనివాడు దైవప్రేమను ఎట్లు పొందగలడు?

దానధర్మము లేక దయయు సత్యములేక
మానసమున మంచి నీతిలేక
చెడుగుణంబులతోడ చెరలాడుచున్నట్టి
నరుడు యిలను చెడును పరము చెడును

తల్లి సేవ మదిని తలచిన తనయుడు
వానిపాపమెల్ల వదలుచుండు
శివుడు మెచ్చు తనకు చిరకీర్తినందించు
దుఃఖరాశినెల్ల తొలగచేయు

**దివ్యాత్మస్వరూపులారా!**

ఏ దేశమునందైనా, ఏ కాలమునందైనా తల్లిని మాతృదేవిగా భావించి ఆమెను సేవించటము ప్రధానకర్తవ్యమని గుర్తించటమే, ఈనాటి విధి. నవమాసములు మోసి కని, పెంచి, రక్షించిన తల్లినే గౌరవించక, తల్లినే సేవించకుండిన, యింక యెవరిని మానవుడు సేవించగలడు? బ్రహ్మాండమును సృష్టించి, మోసి, రక్షించి అనేక విధముల కాపాడుతున్న భగవంతునివంటిదే మాతృమూర్తికూడను. ప్రతి వ్యక్తి భగవంతుని తన యిష్టదేవతాస్వరూపముగా ఆరాధనచేసి సేవిస్తూవుంటాడు. నీ యిష్టదేవతాస్వరూపము నీకెంత ప్రధానమో యితరులయొక్క యిష్టదేవతాస్వరూపము వారికి అంత ప్రధానమైనదనే సత్యాన్ని గుర్తించాలి. అట్లుకాక, యితరుల యిష్టదేవతారాధనను విమర్శించుచూ, ఆక్షేపణ చేయుచున్నప్పుడు మానవుడు యెన్ని విధముల భగవంతుని ఆరాధనలు చేసినప్పటికి పాపమునకు గురికాక తప్పదు. తమ తల్లిని దేవతా స్వరూపముగా ఆరాధించి సేవించి ఆనందింపచేసినట్లుగానే యితరులయొక్క తల్లినికూడను

sri sathyasai vachanamrutam

దేవతగా భావించి ఆరాధించి సేవించటములోపల యెంతైనా సంతృప్తిని పొందాలి. అట్లుకాక, తనతల్లిని దేవతాస్వరూపమని భావించి, పరులతల్లిని ఆక్షేపణ చేయటము మహాపాపము. వారినికూడను తన తల్లివలే భావించి, గౌరవించి, ప్రేమించటము అత్యవసరము. తల్లిప్రేమకు నోచుకోలేని మానవుడు దైవప్రేమనుకూడను పొందలేడు.

**గోవు, భూమి, దేవత, ఋషులు, గురువులను మాతృమూర్తులుగా ఆరాధించి గౌరవించాలి**

ఈనాడు నిత్యజీవితములో సత్యమైన మాతృదేవిని గుర్తించటానికి అనేక విధములైన ఆధారములు వుంటున్నవి. గోవు తన రక్తమును క్షీరముగా మార్చి మనకందించుచున్నది. మనకు పుష్టికరమైన దేహము చేకూర్చుచున్నది. కనుక, గోవు మాతృమూర్తివంటిది. భగవంతుడు మానవుని నిలుపుకొని అనేక విధములుగా రక్షించి కాపాడుతున్నాడు. అదేవిధముగానే భూమికూడను మానవుని తన హృదయమునందు నిల్పుకొని సంరక్షిస్తూ వుంటున్నది. కనుక, భూమికూడను మనకు ప్రధానమైన మాతృమూర్తి. మన దేహములో సర్వాంగములయందుకూడను రసస్వరూపమై దేవతారూపమున దేహమును సంరక్షిస్తూ వుండే దేవతాశక్తి మరొక మాతృమూర్తి. ఈమెకే రసస్వరూపిణి అని ఒక పేరు. ఆ దేవతా శక్తినే 'అంగీరసుడు' అనికూడను పిలుస్తూ వచ్చారు. కనుక, మనదేహములో సర్వాంగములయందు రసస్వరూపమై రక్షిస్తున్న దేవతలుకూడను మనకు మాతృమూర్తులు. ఇంక ఈ జగత్ సంబంధమైన విషయములందు యేది చేయతగనిది, యేది చేయతగినది, ఏది విహితమైనది, ఏది నిషిద్ధమైనది, ఏది మానవునకు ఉత్తమమైనది, ఏది ప్రేయోమార్గము, ఏది శ్రేయోమార్గము అని అనేక శోధనలు చేసి, పరిశీలనలు సలిపి ఆదర్శప్రాయమైన శాస్త్రమును అందించిన మహర్షులుకూడను మాతృమూర్తులే! ఇక, నిత్యజీవితములో మానవునియొక్క శక్తి, సామర్థ్యములను జగత్‌వ్యాప్తి గావించే నిమిత్తమై యితనికి సుజ్ఞానము, ప్రజ్ఞానము, విజ్ఞానము ప్రబోధించిన గురువుకూడను మనకు పూజనీయుడే! ఈ విధంగా గోవు, భూమి, దేవత, ఋషులు, గురువులు ఈ ఐదుమందిని మాతృదేవతాస్వరూపములుగా మనము ఆరాధించి, గౌరవించటము అత్యవసరము.

sri sathyasai vachanamrutam

ఐతే యివన్నియుకూడను వేరువేరు రూప, నామములుగా మనకు గోచరించుచున్నప్పటికిని, ఈ ఐదుకూడను ఒక్క మాతృమూర్తియందే లీనమై వుంటున్నవి. తల్లి తన రక్తమును క్షీరముగా మార్చి బిడ్డకు యిచ్చి పోషించుచున్నది. అదేవిధముగా గోవుకూడను. భూమి మానవుని తన హృదయమునందు నిల్పుకొని ఏ విధముగా సంరక్షించుచున్నదో అదేవిధముగానే తల్లి తన పొట్టలో స్థానమునిచ్చి తాను మోసి అనేకవిధములుగా బిడ్డకు తగిన వ్యవస్థిని చేకూర్చుచూ వచ్చుచున్నది. దేహములోని ప్రతి అంగములోకూడను అంగీరసస్వరూపమైన దేవతలు దేహమునకు తగిన శక్తినిచ్చి కాపాడుతున్నారు. కనుక, రసస్వరూపులైన దేవతలు కూడను తల్లియందే వుంటున్నారు. ఋషులు ఇక ఏది మంచి, ఏది చెడ్డ, ఏది చేయతగినది, ఏది చేయతగనిది అని నిర్ణయించి తల్లివలె బిడ్డయొక్క క్షేమాన్ని, శ్రేయస్సును రక్షిస్తున్నారు. కనుక, అట్టి ఋషిత్వముకూడను మన తల్లియందే వుంటున్నది. చివరిగా గురువుకూడా తల్లివలె బిడ్డకు యింట, బయట యేవిధముగా ప్రవర్తించాలి, పెద్దలతో యేవిధముగా పలుకరించాలి, సంభాషించాలి, పెద్దలను యేవిధముగా గౌరవించాలి అనే విద్యలను నేర్పుతూ వుంటాడు. కనుక, నిజమైన గురుత్వము తల్లియొక్క స్వరూపమే!

**మాతృమూర్తిని ప్రేమించి, గౌరవించటము ప్రతి మానవునియొక్క విధి**

అట్టి తల్లిని గౌరవించలేని, పూజించలేని మానవునియొక్క బ్రతుకు నిరర్థకమనే చెప్పవచ్చు. కనుక, సర్వశక్తి స్వరూపిణియైన మాతృమూర్తిని మనము గౌరవించి, ప్రేమించటము ప్రతి మానవునియొక్క విధి. ఈ పవిత్రమైన దివ్యసూక్తులను జగత్వ్యాప్తి గావించే నిమిత్తమై ఈ దేవీనవరాత్రులు జగత్తుకు అనేక విధములైన ఆదర్శములను నిరూపిస్తూ వచ్చాయి. 'దుర్గా లక్ష్మీ సరస్వతి' అనే మూడు పేర్లలోపల మాతృతత్త్వము ప్రకటితమవుతూ వస్తున్నాది. 'దుర్గ' అనగా శక్తి స్వరూపిణి. ఎట్టి శక్తి? శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులు. ఈ మూడు శక్తులను ప్రసాదించే శక్తి స్వరూపిణియే 'దుర్గ.' దీనినే energy అన్నారు. ఇంక లక్ష్మి. ఈమె జ్ఞానైశ్వర్యము, గుణైశ్వర్యము ఇంకా అనేకరకములైన లోకములో మనము అనుభవించదగిన ఐశ్వర్యమంతాకూడను అనుగ్రహించేటువంటిది. ఐశ్వర్యమనగా కేవలము కరెన్సీనోట్సు మాత్రమే కాదు. గుణైశ్వర్యము, జ్ఞానైశ్వర్యము. నిజానికి మన ఆరోగ్యముకూడను ఒక విధమైన ఐశ్వర్యమే!

ఈ విధంగా సర్వైశ్వర్య స్వరూపిణియే లక్ష్మి. ఇంక సరస్వతి. ఈమె మనకు తెలివితేటలను, విచారణాశక్తిని, బుద్ధిశక్తిని ప్రసాదించేటువంటిది. ఈ దుర్గ, లక్ష్మి, సరస్వతుల ప్రభావమును ప్రపంచమునకు చాటే నిమిత్తము ఈ శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఈ త్రిమూర్తి స్వరూపిణియే మాతృమూర్తి. బిడ్డలకు అవసరమైన శక్తులనంతా తానే అందిస్తున్నది. బిడ్డ ఐశ్వర్యవంతుడై, ఆరోగ్యవంతుడై, ఆనందవంతుడై లోకములోపల కీర్తి వహించాలని అతనిని ప్రేమిస్తూ అతనియొక్క అభివృద్ధికి అనేక వ్యూహములు గావిస్తూ వుంటుంటాది. తన కుమారుడు గొప్ప విద్యావంతుడై, తెలివితేటలు కలవాడై లోకములోపల గొప్పకీర్తిని సాధించాలని తల్లి ఆశిస్తూ వుంటుంది.

**తల్లి ప్రేమ, ఆశీర్వాదము మరియు అనుగ్రహములను పొందటమే పుత్రుని లక్ష్యము**

పాండవులు కృష్ణుని సేవలో, ఆయన ఆజ్ఞలో తమ జీవితాన్ని ధన్యము గావించుకోటానికి కేవలము పాండవులయొక్క శక్తిసామర్థ్యములే కారణము కాదు. కుంతీదేవియొక్క ప్రేమతత్త్వమే కారణము. కుంతి తన పిల్లలను ప్రాణసమానముగా భావించి అరణ్యములో వుండిన సమయములో వారి క్షేమము నిమిత్తము అనేక విధములైన ప్రార్థనలు సలుపుతూ వచ్చింది. తన బిడ్డలు లక్కగృహములో వుండినప్పుడుకూడను వారితోబాటు తానుకూడ ఆ లక్కగృహములోనే వుండి వారియొక్క క్షేమాన్ని ఆశిస్తూ, ప్రార్థిస్తూ వుండేటువంటిది. పాండవులుకూడను దీనికి తగినట్లుగా తమ మాతృప్రేమను అభివృద్ధి గావించుకుంటూవుండేవారు. రామాయణంలో పదునాలుగు సంవత్సరములు లక్ష్మణుడు తన అన్నయైన రామునికి తోడుగా అరణ్యములోపల ఆనందముగా నిద్రాహారములు మాని తన అన్నను కాపాడుతూ వుండటానికి మూలకారణము, తన మాతృమూర్తియైన సుమిత్రయొక్క ప్రేమయే! రామలక్ష్మణులు అయోధ్యను వదలే సమయమునందు కౌసల్య, రాముడు వెళ్లుతున్నాడని బాధపడింది. కాని, సుమిత్ర బాధపడలేదు. పైగా లక్ష్మణునికి హితబోధలు చేస్తూ 'నాయనా! లక్ష్మణా! రాములులేని ఈ అయోధ్య మాకు అరణ్యము. రాములు వున్న అరణ్యమే నీకు అయోధ్య. రామసేవయే నాసేవగా భావించి, నిద్రాహారములైననూ మాని రామునియొక్క మనస్సునకు అసంతృప్తి కలుగకుండా నీవు సేవించి రమ్మ'ని ఆశీర్వదించింది. ఆ తల్లియొక్క ఆశీర్వాదఫలముచేతనే పదునాలుగు సంవత్సరములు నిద్రాహారములు లేక

sri sathyasaivacharamrutam

ఆనందముతో రాములను సేవిస్తూ వచ్చాడు, లక్ష్మణుడు. ఏతావాతా సమస్త పురాణములందు, పవిత్రమైన చరిత్రములందుకూడను తల్లియొక్క ప్రేమ, తల్లియొక్క ఆశీర్వాదము, తల్లియొక్క అనుగ్రహమే ప్రధానమైన లక్ష్యమని బోధింపబడింది. ఈ విషయాన్నే ఈ శరన్నవరాత్రులు మనకు చక్కగా ప్రబోధిస్తూ వస్తున్నాయి.

**కన్నతల్లిని ప్రేమించి, ఆరాధించినప్పుడు సర్వదేవతలను ఆరాధించినవాడవుతాడు**

యుద్ధానంతరము కుమారులను కోల్పోయి పరితపిస్తున్న ధృతరాష్ట్ర గాంధారులను పలుకరించే నిమిత్తమై కృష్ణుడు వారిదగ్గరకు వచ్చాడు. కృష్ణుడు వచ్చాడన్న వార్త వినిన తక్షణమే ఒకవైపున పట్టలేని దుఃఖము, మరొకవైపున భరించలేని క్రోధముకూడను గాంధారిలో బయలుదేరింది. తాను కృష్ణుని సమీపించి అతని చేతులు గట్టిగా పట్టుకొని "కృష్ణా! నీకెందుకింత భేదము? నీవు భగవంతుడైవుండికూడను ఒకరిని ఒక విధంగా మరొకరిని మరొక విధంగా చూడటము నీకు న్యాయమా? పాండవులు నీకంతప్రియులు, కౌరవులు అప్రియులు కావటానికి కారణమేమిటి? పంచపాండవులు సుక్షేమముగా వుంటున్నారు. నా నూర్గురు పుత్రులలో ఒక్కరినైనా నిలబెట్టటానికి నీకు మనసొప్పలేదా? అంత్యములోపల తల్లితండ్రులకు యింత పిండమునైనా వదలటానికి ఒక్క కుమారునైనా బ్రతికించకూడదా? ఇంత కఠినమైన హృదయము నీకెట్లా కలిగింది?" అని అనేక విధములుగా నిందిస్తూ తన శోకమును భరించుకోలేక కృష్ణునిపైన అనేక అపవాదులను వేస్తూ వచ్చింది. ఎన్ని అపవాదులు వేస్తూ వచ్చినప్పటికిని, ఎంత నిందించుతూ వుండినప్పటికిని, కృష్ణుడు చిరునవ్వులు నవ్వుతూ "గాంధారీ! యిది నా దోషము కాదు. ఇది నీ దోషమే! నీకు పుట్టిన పుత్రులను ఒక్క క్షణమైనా కన్ను తెరిచి చూచావా? నీ దృష్టికి నోచుకున్న పుత్రుడు ఒక్కడన్నా వున్నాడా? తల్లిదృష్టికే నోచుకోనివాడు దైవదృష్టికి యేవిధముగా నోచుకుంటాడు? నీ స్వార్థముతో నీ పతికి నేత్రములు లేవని నీవుకూడను కృత్రిమముగా నేత్రములు కట్టుకున్నావు. ఎవడు కుమారుడో, ఎవడుకాదో అనేదికూడా నీకు తెలియదు. నూరుమంది పుత్రులలోపల ఒక పుత్రుడైననూ నీ దృష్టికి నోచుకున్నాడా! అలాంటి మాతృమూర్తి దృష్టికి నోచుకోలేని పాపులు నా దృష్టికి మాత్రము నోచుకోగలరా? పాండవులు అట్లుకాదు. జన్మించినది మొదలు తల్లి తన ఒడిలో పెట్టుకొని ప్రాణసమానముగా క్షణక్షణము

sri sathyasai vachanamrutam

వారిని కాపాడుతూ వచ్చింది. ఆ కుంతియొక్క ప్రేమయే పాండవులను రక్షించింది. ఆ తల్లిపై పాండవులకుగల ప్రేమయే వారిని కాపాడింది. ఇది ప్రకృతియొక్క సహజ ధర్మము. ఈధర్మాన్ని అనుసరించిన ప్రతివ్యక్తికూడను సుక్షేమాన్ని పొందగలుగుతాడు. కనుక, ఈ దుర్గ, లక్ష్మి, సరస్వతులను భౌతికమైన ధనమునిమిత్తమై, భౌతికమైన విద్యనిమిత్తమై ప్రత్యేకించి ఆరాధనలు చేయనక్కరలేదు. మన కన్నతల్లిని ప్రేమించి ఆరాధించినప్పుడు మాత్రమే సర్వదేవతలను ప్రేమించినవారమవుతాము. తల్లికి మించిన స్వర్గము లేదు.

ఈ విషయాన్ని ఒకానొక సమయములో రాముడుకూడను "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని ఉద్ఘాటించాడు. తల్లికంటె స్వర్గము మరొకటి లేదు. కనుక, తల్లిప్రేమను మనము హృదయములో అభివృద్ధి గావించుకోవాలి. తల్లి రక్షణే జీవితమునకు శుభరక్ష! ఒక్కొక్కప్పుడు తల్లితండ్రులు తమపుత్రుని దుశ్చేష్టలను గుర్తించి కొంత శిక్షనందించటానికి పూనుకొనవచ్చు. అయినప్పటికి మన దోషము యెక్కడవున్నదనే విషయాన్ని మనము విచారించాలి కాని, తల్లిదండ్రులపై కోపము తెచ్చుకోకూడదు. ఈత తెలియనివాడు నీటిలోపడి ప్రాణము విడుస్తే ఆ తప్పు నీటిదా లేక అతనిదా? ఈత నేర్చిన తరువాత నీటిలో దిగాలిగాని, యీతనేర్చకుండా నీటిలో పడటం నీ తప్పు. అది నీటి తప్పుకాదు. అగ్నిలో చేయిపెట్టి కాలిందని అగ్నిని దూషిస్తే అది అగ్ని తప్పా, నీ తప్పా? అందువలన మాతృమూర్తికి హితమైన కార్యములు మనము చేస్తూ రావాలి. మాతృమూర్తిని ప్రేమించి, మాతృశక్తిని గుర్తించి, మాతృమార్గమును అందించేదే ఈ శరన్నవరాత్రి. అట్లు కాకుండా దుర్గ, లక్ష్మి, సరస్వతి అని అనేక విధములుగా ధనము ఖర్చుపెట్టి, పువ్వులు తెచ్చి, కుంకుమతెచ్చి పూజించి, ప్రార్థించి, తల్లిమాటను మీరినప్పుడు ఈ పూజయొక్క ఫలితమును ఏమాత్రము పొందలేము.

## మాతృదేవతయే దుర్గ, లక్ష్మి, సరస్వతీ స్వరూపము

కనుక, తల్లియే దుర్గ, లక్ష్మి, సరస్వతి స్వరూపము. తల్లినిమాత్రం యేనాడు కంటిధారలు కార్పించటానికి ప్రయత్నించకూడదు. ఎక్కడైనను, యితర దేశములందుకూడను వుండవచ్చును. కాని, తల్లిని నిరాదరణ చేయరాదు. 'కలకంఠి కంట కన్నీరొలికిన సిరియింట నుండ నొల్లదు' అన్నారు. కనుక, మాతృమూర్తులను యేమాత్రము హింసించకుండా వుంటుండాలి. సీతను

srisathyasaivachanamrutam

హింసించి కంటిధారలు కార్పించడంచేతనే రావణుని వంశమంతా నిర్మూలమైపోయింది. పవిత్రమూర్తి ద్రౌపదిని పరాభవము గావించి ఆమెను దుఃఖమునకు గురిచేయటంచేతనే కౌరవుల వంశమంతా నిర్మూలమైపోయింది. ఇదే విధముగా స్త్రీలను యే చిన్న విషయమునందుకూడను బాధించటానికి ప్రయత్నించకూడదు, పురుషులు. స్త్రీలయందు కేవలము మాతృ స్వరూపిణియైన శక్తి వున్నదనే సత్యాన్ని గుర్తించి, వర్తించటము అత్యవసరము.

ఈ శరన్నవరాత్రిలోపల దేవీపూజలను ఆచరిస్తూ వుంటారు. లలితా సహస్రనామములు చేస్తూ వుంటారు. అనగా ఈ శరన్నవరాత్రులంతాకూడ శక్తి స్వరూపిణి ఆరాధనలగానే వుంటుండాది. స్త్రీలను కేవలము ఆటబొమ్మలుగా వినియోగించుకోరాదు. ఆరాధనా స్వరూపులు వారు. వారిని సామాన్యమైనరీతిగా భావించి సహజమైన రీతిలోపల అనుభవించటానికి ప్రయత్నిస్తూ వుంటారు. ఇది చాలా తప్పు. ఏ క్షణములో, ఏ ప్రదేశములో, ఏ కాలములో ఎప్పుడు వారి హృదయములు నొప్పించుతారో గుర్తించుకోటానికి వీలుకాదు. స్త్రీలను చూచినప్పుడు చాలా వినయవిధేయతలతో మొట్టమొదట వారికి నమస్కరించి అతిదూరముగా వుండే ప్రయత్నము చేయాలి. అంతేగాని, వారిని ఏదో ఆటవస్తువుగా ఉపయోగించుకొని హాస్యాస్పదము గావించటము సరైన ధర్మము కాదు. 'మాతృదేవోభవ', 'పితృదేవోభవ', 'ఆచార్యదేవోభవ', 'అతిథిదేవోభవ' ఈ నాలుగు స్థానములందుకూడను మాతృదేవికి యిచ్చిన స్థానము మరొకరికి యివ్వలేదు. సామాన్యమైన మాటలయందుకూడను తల్లి, తండ్రి, దైవము అంటారు. దైవాన్ని వెనుకపెట్టారుగాని తల్లిని ముందు ఉంచారు, పవిత్రమైన భారతీయ సంస్కృతియందు. ఈ పవిత్రమైన పదమునకు మనము ఈనాడు ఎంతవరకు గౌరవము నందిస్తున్నాము? కానీ స్త్రీలను అబలలుగా భావించుకొని వారిని అశక్తులుగా విశ్వసించి యేదోవారు వంటరూములో వుండే పనిమనిషిగా భావిస్తున్నారు. భగవద్గీతలోపలకూడను స్త్రీలలోపల ఏడు విధములైన శక్తి కలదనింది. అటువంటి శక్తి స్వరూపిణియైన స్త్రీలను మనము ఏవిధముగా గౌరవించాలి? ఏ విధముగా ఆనందపెట్టాలి? ఈ విధానమును ఈ శరన్నవరాత్రి లోపల చక్కగా మనము గుర్తించుకోటానికి ప్రయత్నించాలి. ఇట్టి పరమనీతిని, పరమ పవిత్రతను ప్రబోధించే దినములే ఈ శరన్నవరాత్రి దినములు.

srisathyasaivechanamrutam

## సృష్టి అంతా భగవత్స్వరూపముగా భావించి ఆరాధన చేయటమే శరన్నవరాత్రుల విశిష్టత

ఈ ఎనిమిది దినములుకూడను ఈ త్రిమూర్తి స్వరూపమైన మాతృమూర్తిని ఆరాధన చేసి కడపటి దినము సరస్వతీ పూజలో ప్రవేశిస్తున్నాము. అనగా ఆయుధపూజగా మనము ఆరాధన చేస్తున్నాము. ఆనాడు మనయొక్క వస్తు వాహనాలు, కొన్ని గ్రంథములు, మన ప్రధానమైన వస్తువులను పూజలో పెట్టి ఆరాధనలు సలుపుతున్నాము. ఈ ఆరాధన సర్వదేవతా స్వరూపిణియైన కాళీశక్తియొక్క తత్త్వమును ప్రబోధించేటువంటిది. ఆనాడు జడమైన వస్తువులను కూడను దైవముగా ఆరాధిస్తారు. భారతదేశములో యిట్టి ఆరాధనా తత్త్వము అందరికి తెలిసిన విషయమే! జడమైన ఒక పెద్దలారీని కూడను డ్రైవరు డ్రైవ్ చేయటానికి ముందుగా స్టీరింగునకు నమస్కారము చేసి తాను డ్రైవింగు ప్రారంభిస్తాడు. ఇట్లే సంగీతమునకు సంబంధించిన పనిముట్లుకూడ! వయెలిన్ వాయించాలంటే ముందు ఆ వయెలిన్‌కి నమస్కారము చేసి దానిని ప్రారంభిస్తారు. ఒక నర్తకి తన గజ్జలు కాలికి కట్టుకొనే ముందుగా వాటికి నమస్కరించి తదుపరియే తన కాలికి చుడుతుంది. ఇంకా తాపీపని చేసే మేసన్‌కూడ తన పని ప్రారంభించే ముందుగా తాపీకి నమస్కారము చేసి పని ప్రారంభిస్తాడు. ఈ విధముగా మనము యోచనచేస్తే భగవంతుడు లేని వస్తువు జగత్తులో లేదనే విశ్వాసమే దీనికి ఆధారము. కనుక, సమస్తము భగవత్ స్వరూపముగా భావించుకొని ఆరాధన చేయటమే ఈ శరన్నవరాత్రియొక్క విశిష్టత.

### మన భావములను పురస్కరించుకొనియే జగత్తు నడుస్తూంటుంది

ఇదియే 'విశ్వం విష్ణు స్వరూపమ్' అనే సూక్తికి అర్థము. ఈ భావమునందు జగత్తు కేవలం మిధ్య కాదు. యిది సత్యమే! ఈ సత్యమును మిధ్యగా భావించుకోటం చేత మనము మిధ్యా జీవితమునే గడుపుతున్నాము. 'యద్భావం తద్భవతి', అని మన భావములను పురస్కరించుకొనియే ఈ జగత్తు నడుస్తూ వుంటాది.

**పూలమొక్కలు నాటిన పూలు పూయు**
**ముండ్ల మొక్కలు నాటిన ముండ్లు పొడవు**
**మంచి చెడ్డలు యివ్విధి వుండె యిలను**

sri sathyasai vacharamrutam

ఏ భావములో, ఏ తలంపులో అలాంటి ఫలితమునే మనము పొందుతూ వుంటాము. కనుక మంచి తలంపులను మనము అభివృద్ధిగావించుకొని, మంచి ఫలములు పొందటానికి ప్రయత్నించాలి. నిరంతరము చెడ్డ తలంపులనే అభివృద్ధి గావించుకొని చెడ్డ జీవితమును గడపటము మానవుని కర్తవ్యము కాదు. ఇది మానవత్వమునే నిర్మూలము గావించే మార్గము. మనము సర్వులను గౌరవించాలి, సర్వులను ప్రేమించాలి. ఆ ప్రేమయే ప్రధానమైన స్థానములో మనము వుంచుకోవాలి.

దివ్యాత్మస్వరూపులారా! అనవసర విషయాలతో తలను నింపుకొనక మీరు సద్భావములతో హృదయమును నింపుకోటానికి ప్రయత్నించండి. ఈనాడు మనము తలలో వ్యర్థమైన విషయములను నింపుకోటానికి ప్రయత్నిస్తున్నాము. మనకు తల యిచ్చినది అందుకోసం కాదు. మన తలంపులన్నియు దైవతలంపులుగా మారాలి. చేసిన పనులన్నియు దైవసేవగా రూపొందాలి. పలికిన పలుకులన్నియు పరమాత్ముని మంత్రములుగా రూపొందాలి. ఉత్తమమైనదే మానవజీవితము. అందువలననే మానవజన్మము వుత్కృష్టమైనదని శృతి బోధిస్తున్నది. 'జంతూనాం నరజన్మ దుర్లభమ్.' పశుపక్షి మృగాదులవలె మనము తిరిగి, ఆనందించి, కాలమును వ్యర్థము గావించినామంటే యింక మానవజన్మ దుర్లభమైనది ఎట్లా అవుతుంది? పశుపక్షి మృగాదులతో మనము సమానమే! కాని, అన్ని విషయాలలో కాదు. భగవంతుడు మానవునకు ప్రసాదించిన సర్వాంగములుకూడను భగవత్ ప్రీత్యర్థమైన కార్యములలో వినియోగించుకోవాలి.

**దేహమునకు కర్మయే ఆధారము**

ఇక యజ్ఞమును గురించి. యజ్ఞమంటే ఏమిటి? భగవత్ ప్రీత్యర్థముగా చేసిన కార్యములన్నీ యజ్ఞములే! భగవత్ ప్రీత్యర్థముగా మనము ఏ చిన్నపని చేసినా అది యజ్ఞస్వరూపముగానే మారిపోతుంది. త్యాగమే యజ్ఞము. యజ్ఞమంటే కేవలము ఒక పెద్ద హోమగుండము కట్టి దానియందు మంత్రసహితముగా ఆవునెయ్యి హోమము చేయుట మాత్రమే యజ్ఞము కాదు. ఏ చిన్నపని చేసినప్పటికిని దానిని దైవప్రీత్యర్థముగా చేసినప్పుడు అది యజ్ఞముగా మారిపోతుంది. కనుకనే ఉపనిషత్తులు కూడను ఏ కర్మ నీవు ప్రారంభించినప్పటికి ఆ కర్మకు ముందుగా

srisathyasaivachanamrutam

నమస్కారము చేయమన్నది. 'తస్మై నమః కర్మణే.' నేను ఆచరించే కర్మకు నేను మొట్టమొదట నమస్కరిస్తున్నాను. నేను పవిత్రమైన కర్మలుగా ఆచరించాలి అనే ఉద్దేశ్యముతో చేసే ప్రక్రియయే యిది. మానవుడు శరీరమును ధరించటానికి కారణము ఏమిటి? 'కర్మానుబంధీని మనుష్యలోకే!' మన కర్మలననుసరించియే దేహము వచ్చింది. కాబట్టి దేహమునకు కర్మయే ఆధారము. ఈ కర్మకు రాగమే ఆధారము. రాగమునకు ద్వేషమే ఆధారము. ద్వేషమునకు అహంకారమే ఆధారము. అహంకారమునకు అవివేకమే ఆధారము. ఈ అవివేకమునకు అజ్ఞానమే మూలకారణము. కనుక అజ్ఞానమును మనము నశింప చేసుకుంటే అవివేకము క్షీణించిపోతుంది. ఈ అవివేకము నశించిందంటే అంధకారము నిర్మూలమవుతుంది. ఈ అహంకారము నిర్మూలమాయెనా, ద్వేషము నశిస్తుంది. ఈ ద్వేషము పోయెనా రాగము క్షీణించిపోతుంది. రాగము క్షీణించినప్పుడు కర్మలే నశించిపోతాయి. కర్మ నశించిన దేహమే మనకు వుండదు. కనుక ఈ దేహము సార్థకము కావాలనుకొన్నప్పుడు మొట్టమొదట అజ్ఞానము నిర్మూలము గావించాలి. అజ్ఞానమంటే ఏమిటి? 'నేను దేహమని అనుకోటమే పెద్ద అజ్ఞానము.' ఈ దేహము నేననే అజ్ఞానము మొట్టమొదట నిర్మూలముగావాలి. అది ఏ విధముగా నిర్మూలమవుతుంది? దానిని కూడను దైవముగానే మనము భావించాలి. 'సర్వము భగవత్ స్వరూపమే! సర్వము భగవచ్ఛక్తియే', అనే విశ్వాసమును మనము అభివృద్ధి గావించుకోవాలి.

**అంతా దైవమునకు సంబంధించినదే, యేదీ నాది కాదు అని తెలుసుకోవటమే వేదాంతము**

'నా దేహము, నా దేహము', అంటున్నావు. ఈ దేహమునకు ముందున్న యీ 'నా' ఏమిటి? ఇక్కడ నాది అనేదే ఒక మమకారము. నేను అనేదే అహంకారము. ఈ 'నాది, నేను' అనేవి ఎక్కడివి? అంతా భగవంతునివే! మొన్న నేను హాస్టలుకి వెళ్లినప్పుడు పిల్లలకు చెప్పాను. అరణ్యవాసం చేసుకొని వచ్చిన తరువాత అనేకమంది ఋషులు అంతా శ్రీరామచంద్రుని 'రామోవిగ్రహవాన్ ధర్మః', 'నీవు సాక్షాత్తు ధర్మస్వరూపుడవే, నీవు సాక్షాత్తు భగవత్ స్వరూపుడవే', అని వర్ణిస్తూ వుండినారు. ఈ సత్యాన్ని గుర్తించిన రాముడు కైక వంటరిగా వున్న సమయము చూసి అతని దగ్గరకు వెళ్లి "రామా! నీ శక్తిసామర్థ్యములు నేను గుర్తించుకోలేకపోయాను. నేను

sri sathyasai vahinamrutam

చేసిన పాపమునకు ఏదైనా పరిహారము బోధించమంది." "అమ్మా! నీవు చేసింది పాపమేమీ కాదు. ఈ ప్రకృతియొక్క న్యాయమే! ప్రకృతి ధర్మాన్ని సర్పులూ అనుసరించవలసినదే! నీవు చేసినది చాలా ఉపకారము. కానీ, నీవు కోరుతున్నావు కనుక ఉపదేశము చేయటానికి నేను పూనుకొంటున్నాను. రేపటి దినము తెల్లవారి నీవు సరయూ నదికి వెళ్లి స్నానం చేసి రమ్మ"న్నాడు. నీవు వచ్చే దారిలో ఏ విధములైన శబ్దములు నీవు వింటావో వాటిని చక్కగా గుర్తించుకొని రమ్మన్నాడు. ఆమె స్నానము నాచరించి గట్టుకు వచ్చేటప్పటికి ఒకవైపున మేకలు ఒకవైపున గొఱ్ఱెలు గుంపులు గుంపులుగా మేస్తున్నాయి. అవి నిర్విరామముగా 'మే, మే', అని అరుస్తున్నాయి. కైక తిరిగి రాముని దగ్గరకు వెళ్లింది. రాముడు 'అమ్మా! నీవు విన్న శబ్దము ఏమిటి?' అని అడిగాడు. కైక "నాయనా! గొఱ్ఱెలు, మేకలు యెక్కడ చూచినాగాని 'మే, మే' అని అరుస్తున్నాయి. ఈ శబ్దమును మాత్రమే నేను విన్నాను", అంది. 'మే, మే' అనగా సంస్కృతములో 'నాది, నాది' అని. ఏది నాది? అంతా నాది అనుకుంటున్నాము. అలా అనుకున్నంత కాలము అది మన దగ్గర లేకుండా వుంటున్నాది. "దశరథుని నావాడు అనుకున్నావు, నీవు. ఏడీ దశరథుడు? ఇదంతా నాది అనుకున్నావు. ఏది నీది? ఏదీ నీది కాదు. అంతా దైవానిది. అదే ఉపదేశము", అన్నాడు రాముడు. అంతా దైవమునదే, ఏదీ నాది కాదనే భావమునకు మనము యేనాడు వస్తామో అదే నిజమైన వేదాంతము. అదే నిజమైన జ్ఞానము. ఆ జ్ఞానము మనలో ప్రారంభమయ్యేంతవరకు మనము అజ్ఞానములో మునిగిపోవలసిందే!

సాధ్యమైనంతవరకు దేహభ్రాంతిని వదలుకొని దైవభ్రాంతిని అభివృద్ధి చేయటానికి తగిన కృషి చేయటమే మానవుని ప్రధాన కర్తవ్యము. మొట్టమొదట మాతృమూర్తిని గౌరవించండి. మాతృమూర్తిని ప్రేమించండి. మాతృమూర్తిని సేవించండి. ఈ దేహమునకు మూలకర్త మాతృదేవి. కనుక, ఎవ్వరూ కూడను తల్లిని బాధించటానికి ప్రయత్నించకూడదు. ఈ విధమైన మార్గము అనుసరించనంతవరకు మనకు దుఃఖము తప్పదు. మొదటి దినము మనము నేర్చుకొనవలసిన పాఠము యిదియే! ఈ పాఠము నేర్చుకొనక మనము పరీక్షలో ఉత్తీర్ణులము కాలేము. ప్రాథమిక క్లాసులోపల ఉత్తీర్ణులు కాకుండా పై క్లాసులకు వెళ్లటానికి వీలుకాదు. కనుక, మొట్టమొదట మన తల్లిని మనము సంతృప్తి పరచటానికి ప్రయత్నించాలి. దీనినే 'యింట గెల్చి రచ్చ గెలవటమ'న్నారు. తల్లినే సంతృప్తి పరచలేని నీవు దైవాన్ని యేరీతిగా



sri sathyasaivahini.org

సంతృప్తి పరచగలవు? కనుక, మొట్టమొదట అన్నివిధముల తన రక్తాన్ని, తన జీవితాన్ని, తన సర్వశక్తిని ధారపోసిన తల్లిని గౌరవించటము నేర్చుకోవాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ. 14-10-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam